క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మీర్‌పేట: చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆదివారం మీర్‌పేట ఏఈ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. 11కేవీ నందిహిల్స్ ఫీడర్ పరిధిలోని నందిహిల్స్, శివగంగహిల్స్, టీచర్స్‌కాలనీ, శివాహిల్స్, ప్రశాంతిహిల్స్, డీఎల్ఆర్ఎల్ కాలనీ, చైతన్యహిల్స్ కాలనీలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ టీఆర్ఆర్ టౌన్‌షిప్ ఫీడర్ పరిధిలోని హనుమాన్‌నగర్, గుడ్‌లైఫ్ స్కూల్, పల్లవినగర్, ఆర్టీసీకాలనీ, టెలిఫోన్‌కాలనీ, మారుతీనగర్, రాఘవేంద్రనగర్, గౌతమినగర్, ఆదిత్యనగర్, టీఆర్ఆర్ టౌన్‌షిప్, ఆదర్శనగర్ కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుతసరఫరా నిలిపివేస్తామని తెలిపారు. ఈ అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కందుకూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ మంద జ్యోతిపాండు అధ్యక్షతన సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకట్రాములు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమైయ్యే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

మంత్రి సబితారెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సబితారెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కుమ్మరి సంఘం నాయకులు

కందుకూరు: కుమ్మరుల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రానికి రెండు ఎకరాల భూమిని కేటాయించినందుకు కుమ్మర సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు ఎగిరిశెట్టి బాలయ్య ఆధ్వర్యంలో ఆదివారం మంత్రి సబితారెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కొత్తూర్ పరిధిలో ప్రభుత్వం కేటాయించిన భూమిలో భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం మహేశ్వరం, కందుకూరు మండలాల అధ్యక్షులు మాడుగుల రాజు, బొడ్డుపల్లి రవి, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ ఇన్‌చార్జిగా ఎడ్ల మల్లేశ్



మీర్‌పేట: టీడీపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా మీర్‌పేట కార్పొరేటర్ ఎడ్ల మల్లేశ్ ముదిరాజ్‌ను నియమిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ప్రకటించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ గతంలో టీడీపీ కార్యకర్తగా పనిచేసిన తనను గుర్తించి నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. కాసాని జ్ఞానేశ్వర్ నాయకత్వంలో పార్టీని పటిష్టం చేస్తానని చెప్పారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు.

బాలగంగాధర్ తిలక్, ఆజాద్‌లకు నివాళి



మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

వనస్థలిపురం: భారత స్వాతంత్రోద్యమంలో యువతకు మార్గదర్శకం వహించి, స్వాతంత్రం నా జన్మ హక్కు అని నినదించిన బాలగంగాధర్ తిలక్, అతి చిన్న వయసులో దేశ స్వాతంత్రం కోసం తన ప్రాణాలు అర్పించిన చంద్రశేఖర్ ఆజాద్ నేటి యువతకు ఆదర్శమని బీజేపీ నాయకులు పోచంపల్లి గిరిధర్ అన్నారు. ఆదివారం బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌ల జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంక్ వద్ద వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బీరం శ్రీధర్, కాల్వ బాల్‌రాజ్, శ్రీధర్ రావు, సురేష్‌బాబు, సతీష్, శ్రావణ్, ఆకాష్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ పరామర్శ

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు గోసుల కృష్ణయ్య(45) శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదివారం ఉదయం మండలంలోని ప్రజాప్రతినిధులు పరామర్శించారు. కృష్ణయ్య భౌతికకాయానికి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్, రైతుబంధు జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, గంప శ్రీనివాస్, మహేశ్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

చెత్తకు చోటేదీ?

- డంపింగ్‌కు పరిష్కారమెక్కడ?
- కలుషితమవుతున్న జల్‌పల్లి చెరువు
- ఆందోళనలకు సిద్ధమవుతున్న స్థానికులు



బీజాన్ గుట్టపై పేరుకుపోయిన వ్యర్థాలు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ ఏర్పడి ఏండ్లు గడుస్తున్నా డంపింగ్ యార్డ్ సమస్య తీరడం లేదు. వార్డులలో సేకరిస్తున్న చెత్తను జల్‌పల్లి కార్గో రోడ్డు పక్కన ఉన్న బీజాన్ గుట్టపై డంప్ చేస్తున్నారు. డంప్ యార్డ్ దిగువన మామిడిపల్లి నుంచి జల్‌పల్లి చెరువుకు వెళ్లే వాగు ఉండడంతో వర్షాలు కురిసినప్పుడు చెత్త వ్యర్థాలు జల్‌పల్లి చెరువులో కలుస్తున్నాయి. దీంతో చెరువు కలుషితమవుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళనలో స్థానికులు

పహాడీషరీఫ్, జల్‌పల్లి, శ్రీరాం కాలనీలలోని తొమ్మిది వార్డులలో సేకరిస్తున్న చెత్తను జీహెచ్ఎంసీకి తరలిస్తున్నారు. మిగిలిన వార్డుల్లోని చెత్తను బీజాన్ గుట్టపై వేస్తున్నారు. గతంలో బీజాన్ గుట్టపై చెత్త వేయకూడదని గ్రామస్తుల ఆందోళనలతో జల్‌పల్లి చెరువుకట్టపై డంప్ చేస్తున్నారు. గ్రామం పక్కనే గుట్టలుగా పేరుకుపోయిన చెత్తతో వర్షాకాలంలో విష జ్వరాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

> **డంపింగ్ యార్డ్‌ను తరలించాలి**
>
> 
>
> మున్సిపాలిటీకి సంబంధించిన చెత్తను అధికారులు పోగుచేసి బీజాన్ గుట్టపై పడేయడం సరైంది కాదు. చారిత్రక నేపథ్యం కలిగిన ఈ చెరువును కలుషితం చేయరాదు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని మున్సిపాలిటీ అధికారులు పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
>
> – యంజాల శ్రీనివాస్, జల్‌పల్లి

పెన్షన్ పెంపుపై హర్షం

మీర్‌పేట: ఇప్పటివరకు నెలకు రూ. 3,016 చొప్పున దివ్యాంగులకు నెలవారీగా పెన్షన్ ఇస్తుండగా జూలై నుంచి రూ. 4,016 చొప్పున ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దివ్యాంగులకు వెయ్యి రూపాయలు పెన్షన్ పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం మీర్‌పేట కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని దాదాపు 5 లక్షల మంది దివ్యాంగులకు లబ్ధి చేకూరుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలలో తెలంగాణ రాష్ట్రం దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు రాజేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాంచందర్, కో ఆప్షన్ సభ్యులు జంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎక్కడి దక్కడే..



రోడ్డుపక్క పేరుకుపోయిన చెత్త

కందుకూరు: తమ డిమాండ్ల కోసం పంచాయతీ కార్మికులు సమ్మెబాట పట్టారు. దీంతో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిలిచిపోయాయి. రోడ్లపై చెత్త ఎక్కడికక్కడ నిలిచిపోయింది. దీనికితోడు వర్షాలు కురుస్తుండడంతో దుర్గంధంతో వీధులు కంపుకొడుతున్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చెత్తాచెదారాన్ని నిత్యం తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే దోమలు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు.

కార్మికుల డిమాండ్లు ఇవే..

ఉద్యోగభద్రతలో పాటు స్వీపర్లకు రూ.15,600, ఇతర సిబ్బందికి రూ.19,500 చెల్లించాలని, ప్రమాద బీమా రూ. 10 లక్షలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ వంటి సదుపాయాలు కల్పించాలనే డిమాండ్లతో 17 రోజులుగా సమ్మె చేస్తున్నారు. చెత్త సేకరించేందుకు కార్మికులు ససేమిరా అంటున్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరిస్తేనే దిగివస్తామని స్పష్టం చేస్తున్నారు. దీంతో గ్రామాలు కంపుకొడుతున్నాయి. పరిసరాలను శుభ్రం చేసే వారు కరువయ్యారు. దీనికితోడు దోమల బెడద కూడా పెరుగుతోంది. సీజనల్ వ్యాధులతో పాటు జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. త్వరగా సమస్యకు పరిష్కారం లభించకపోతే గ్రామాల్లో పారిశుద్ధ్యం ప్రమాదకరంగా మారేలా ఉందని ప్రజలు వాపోతున్నారు.

> **ప్రభుత్వం చొరవ చూపాలి**
>
> 
>
> 17 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరం. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తాం. ప్రభుత్వం త్వరగా సమస్య పరిష్కరించాలి.
>
> – బాల్‌రాజు, సీఐటీయూ, కందుకూరు మండల కన్వీనర్

చల్లంగ దీవించి.. అందరినీ కాపాడమ్మా..

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఆదివారం శ్రావణమాసం బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. డివిజన్ పరిధిలోని అంబేద్కర్‌నగర్, పోచమ్మబస్తీ, భగత్‌సింగ్‌నగర్, శంకర్‌నగర్‌లలో జరిగిన అమ్మవారి బోనాల ఉత్సవాల్లో మంత్రి సబితారెడ్డి పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అందరికీ మేలు జరగాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అంకిరెడ్డి, బాలకిషన్, అరవింద్‌శర్మ, జంగారెడ్డి, దయాకర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, మొగిళ్ల మల్లేశ్, మాజీ కార్పొరేటర్ అనితారెడ్డి పాల్గొన్నారు.

సరూర్‌నగర్ డివిజన్‌లో..

సరూర్‌నగర్ డివిజన్‌లో బోనాల ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. బోనాల సందర్భంగా ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, కొత్త మనోహర్‌రెడ్డి, పాండురంగారెడ్డి చెరుకుతోట కాలనీ, పోచమ్మ బస్తీ, శంకర్ నగర్, ఇందిరాహిల్స్, భగత్‌సింగ్ నగర్‌లోని పోచమ్మ, మైసమ్మ అమ్మవార్లను సందర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: మీర్‌పేట పరిధిలోని పలు కాలనీలలో ఆదివారం బోనాల పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఓల్డ్ మీర్‌పేటలోని ఎర్రపోచమ్మ నల్లపోచమ్మ అమ్మవార్లకు రంగారెడ్డి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి బోనం సమర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో కుటుంబసమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కీసర గోవర్ధన్‌రెడ్డి, పల్లె పాండుగౌడ్, పల్లె జంగయ్యగౌడ్ పాల్గొన్నారు.



బడంగ్‌పేట్: బోనాల ఉత్సవాల్లో భాస్కర్‌రెడ్డి తదితరులు

సిర్లాహిల్స్‌లో..

మీర్‌పేట సిర్లాహిల్స్‌లో జరిగిన బోనాల వేడుకకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారి కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. వేడుకలో స్థానిక నాయకురాలు పద్మశ్రీ, అరుణదేవి, నాయకులు సురేందర్‌రెడ్డి, మురళీగౌడ్ పాల్గొన్నారు.

గుర్రంగూడలో వైభవంగా బోనాలు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని గుర్రంగూడలో ఆదివారం బోనాలను వైభవంగా నిర్వహించారు. పోచమ్మ, మర్ల మైసమ్మ, మహంకాళి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గుర్రంగూడ ప్రజలందరికి ఆయన బోనాల శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మీర్‌పేట్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, రవికుమార్, రమేశ్, నాయకులు లింగారెడ్డి, స్వామినాయక్, సంతోష్‌గౌడ్, బాలాకృష్ణ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకన్‌పల్లిలో...

మహేశ్వరం: నందుపల్లిలో బోనాలను ఘనంగా నిర్వహించారు. పోచమ్మకు భక్తులు ఆదివారం బోనాలు సమర్పించారు. ఉదయం నుంచే పోచమ్మ అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గుడిచుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ యాదయ్య, ఉప సర్పంచ్ గురుప్రీత్, నాయకులు కృష్ణయ్య, మాజీ ఉప సర్పంచ్ సుగుణ విజయ్ నాయక్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణయ్య, నాయకులు కమిలి బాయి పలువురు పాల్గొన్నారు.

నందుపల్లిలో...

గ్రామంలో బోనాలను అంగరంగవైభవంగా జరుపుకున్నారు. ఆదివారం సాయంత్రం పోచమ్మ అమ్మవారికి ప్రత్యేకంగా బోనాలు సమర్పించారు. బోనాల ఉత్సవాల్లో సీనియర్ కాంగ్రెస్ నేత చిగురింత నర్సింహారెడ్డి పాల్గొని.. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందుపల్లి సర్పంచ్ కళావతి కిష్టయ్య, ఉప సర్పంచ్ ఉస్మాన్ పలువురు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఘన సన్మానం



మహేందర్‌ను అభినందిస్తున్న సర్పంచ్

కందుకూరు: జాతీయ క్రాస్‌బౌ పోటీల్లో కాంస్యం సాధించిన మండల పరిధిలోని బాచుపల్లికి చెందిన మహేందర్‌ను ఆదివారం ఆ గ్రామ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ గ్రామస్తులతో కలిసి సన్మానించి, రూ.10 వేల నగదు అందించారు. త్వరలో ఆస్ట్రేలియాలో జరగనున్న ప్రపంచస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఉప సర్పంచ్ కొంతం ప్రేమలతబాల్‌రెడ్డి, శేఖర్‌గుప్తా, నాగుల రమేష్, కాటం మహేందర్‌గౌడ్, నర్సింహా, వెంకటయ్య, జంగయ్య, కృష్ణ పాల్గొ న్నారు.



కాంస్యం సాధించిన శివకుమార్‌తో కోచ్

నేదునూరు వాసికి కాంస్యం

ఉత్తరప్రదేశ్ ఆగ్రాలో ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహించిన 4వ జాతీయ క్రాస్‌బౌ షూటింగ్ పోటీలు అండర్–18 విభాగంలో మండల పరిధిలోని నేదునూరుకు చెందిన ఎస్.శివకుమార్ కాంస్య పథకాన్ని సాధించాడు. తెలంగాణ క్రాస్‌బౌ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీచైతన్య, ప్రధాన కార్యదర్శి మాధురీ, ఫిజికల్ డైరెక్టర్ శివకుమార్ తదితరులు ఆదివారం ఆ యువకుడిని అభినందించారు.

ఆర్యవైశ్యబంధు పథకం అమలు చేయండి

సంఘం మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు రామ్మోహన్

ఆమనగల్లు: ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు, వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయ కమిటీ అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్యుల కోసం ఆర్యవైశ్యబంధు పథకం అమలు చేయాలని ఆయన కోరారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సర్కార్ గత ఎన్నికల సమయంలో ఆర్య వైశ్యులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారని గుర్తుచేశారు. జనా భాలో పది శాతం ఉన్న ఆర్యవైశ్యుల అభివృద్ధిని సీఎం కేసీఆర్ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా వెంటనే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం దళితులు, గిరిజనులు, బీసీలు, మైనార్టీల అభివృద్ధి కోసం వివిధ పథకాలు అమలు చేస్తుందని, ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవై శ్యుల అభివృద్ధిని మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. ఆర్యవైశ్యుల కోసం ఆర్యవైశ్యబంధు పథకం అమలు చేయాలని, హైదరాబాద్ లో ఆర్యవైశ్య భవనం నిర్మించాలని రామ్మోహన్ కోరారు.

మణిపూర్ ఘటనకు బీజేపీదే బాధ్యత



మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రధాని దిష్టిబొమ్మ దహనం

తలకొండపల్లి: మణిపూర్ రాష్ట్రంలో జరిగిన అమానవీయ సంఘటనను నిరసిస్తూ దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో మండలంలోని పడకల్‌లో ఆదివారం ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. గ్రామ ప్రధాన కూడళ్ల మీదుగా ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు జోగు రమేష్ మాట్లాడుతూ.. మణిపూర్ ఘటనలకు ప్రధాని మోదీ బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. వెంటనే అక్కడ శాంతి నెలకొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు రమేష్, విజయ్‌కుమార్, సతీష్‌కుమార్, రాములమ్మ, వెంకటమ్మ, కిష్టమ్మ పాల్గొన్నారు.

ప్రధాని స్పందించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: మణిపూర్‌లో ఆదివాసీ గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి, లైంగికంగా వేధించిన దుండగలను శిక్షించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జగన్ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలోని పోల్కంపల్లి గ్రామంలో మణిపూర్‌లోని అమానవీయం ఘటనలను నిరసిస్తూ ఆదివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు నర్సింహ, శాఖ కార్యదర్శులు అశోక్, నర్సింహ, వెంకటేష్, యాదయ్య, దానయ్య, శివ, నవీన్, నర్సింహాలు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై నిరంతర పోరాటం

బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి



ఆవిర్భావ వేడుకలో నాయకులు, కార్మికులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని సూర్యలక్ష్మి కాటన్‌మిల్లు వద్ద ఆదివారం బీఎంఎస్ ఆధ్వర్యంలో బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బీఎంఎస్ జెండాను రాష్ట్ర బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. 1955 జులై 23న మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో బీఎంఎస్ ఆవిర్భవించిందని అన్నారు. దేశంకోసం పనిచేస్తాం.. తగిన వేతనం సాధిస్తాం.. అనే నినాదంతో బీఎంఎస్ పనిచేస్తుందని ఆయన వివరించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి బీఎంఎస్ నిరంతరం పోరాడుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు విష్ణుకుమార్, శంకర్‌మాలిక్, లక్యానాయక్, యాదయ్య, చందర్, శ్రీనివాస్ రెడ్డి, పంతునాయక్, అప్పారావ్, కృష్ణారావ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తే కరెంట్ కోతలు తప్పవు

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ కోతలు ఎక్కువైతాయని రైతు బంధు మండల అధ్యక్షుడు అంజిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ ఇస్తే సరిపోతుందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్‌కు రైతులంటే గిట్టదన్నారు. రైతాంగానికి 24 గంటల పాటు ఉచిత విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. పంటకు గిట్టుబాటు ధర, కొనుగోలుకేంద్రాల ఏర్పాటు చేయడమేగాక రైతుబంధు, రైతు బీమా అందిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కుతంత్రాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

నిధులున్నా.. పనులు సున్నా

- మరమ్మతులకు నోచుకోని పోలెపల్లి– మంగలికుంట తండా రోడ్డు
- అవస్థలు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు




పోలెపల్లి రోడ్డు పరిస్థితి

ఆమనగల్లు: ఆమనగల్లు మండల పరిధిలోని పోలెపల్లి గేటు నుంచి పోలెపల్లి గ్రామం మీదుగా మంగలికుంటతండా వరకు ఉన్న బీటీరోడ్డు అధ్వాన్నంగా మారింది. దాదాపు రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన రోడ్డు నిర్వహణ లేకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. బీటీరోడ్డు ఆధునీకరణకు నిధులు మంజూరైనా టెండర్ ప్రక్రియ జరగకపోవడంతో పనులు చేపట్టడం లేదు. పోలెపల్లి గేటు నుంచి పోలెపల్లి మీదుగా మంగలికుంటతండా వరకు దాదాపు మూడున్నర కిలోమీటర్ల రోడ్డును దశాబ్దాల క్రితం బీటీరోడ్డుగా నిర్మించారు. ఈ రోడ్డు మీదుగా ఆమనగల్లు, వెల్దండ మండలాలకు చెందిన అనేక గ్రామాల ప్రజలు, ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వెల్దండ మండలం అంకమోనికుంట, సల్లపల్లి, బొల్లంపల్లి గ్రామాలకు ఈ రోడ్డు మీదుగా ప్రజలు వెళ్తుంటారు. మాడ్గుల, ఆమనగల్లు మండలాలకు చెందిన అనేక గ్రామాల ప్రజలకు వెల్దండ, కల్వకుర్తి వెళ్లడానికి ఈ రోడ్డు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

మరమ్మతులు చేయకపోవడంతో..

ప్రస్తుతం రోడ్డంతా గుంతలమయంగా మారింది. రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో మరింత అధ్వాన్నంగా తయారైంది. చాలాచోట్ల బీటీ, కంకర కొట్టుకుపోయి మట్టిరోడ్డుగా మారింది. మరమ్మతులు చేపట్టాలని పోలెపల్లి గ్రామ ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్నారు. కాగా పోలెపల్లి గేటు నుంచి మంగలికుంటతండా వరకు రోడ్డు ఆధునీకరణకు ఎంఆర్ఆర్ కింద రూ.64 లక్షలు మంజూరయ్యాయి. అయితే పనులు చేపట్టడానికి టెండర్ ప్రక్రియ నిర్వహించినప్పటికీ ఎవరూ ముందుకు రాకపోవడంతో నిధులు అలాగే ఉన్నాయి. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

> **వెంటనే పనులు ప్రారంభించాలి**
>
> 
>
> పోలెపల్లి గేటు నుంచి మంగళికుంటతండా రోడ్డు ఆధునీకరణకు ప్రభుత్వం రూ.64 లక్షలు మంజూరుచేసింది. రోడ్డు బాగుచేయాలని ఎప్పటినుంచో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను కోరడంతో నిధులు మంజూరు చేయించారు. నిధులు మంజూరైనా పనులు ఇంకా ప్రారంభం కాలేదు. వెంటనే పనులు ప్రారంభించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.
>
> – కుమార్, ఎంపీటీసీ, పోలెపల్లి

ప్రజలు బీఆర్ఎస్‌కే పట్టం కడతారు

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



ఆమనగల్లు: ప్రతిపక్ష పార్టీల మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని.. రాష్ట్రంలో మూడోసారి కూడా కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం రావడం ఖాయమని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌పార్టీ అధిష్టానం మాటే తనకు శిరోధార్యమని ఆయన చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. కల్వకుర్తిలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి వివిధ పథకాల కింద ముఖ్యమంత్రి కేసీఆర్ నిధులు మంజూరు చేశారని ఆయన చెప్పారు. ఆమనగల్లులో డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేస్తున్నామని త్వరలో ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రి స్థాయి పెంచి భవన నిర్మాణానికి కృషి చేస్తామని ఆయన వివరించారు. అభివృద్ధికి అందరూ కలిసిరావాలని కోరారు. రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే చెప్పారు. సమావేశంలో ఆమనగల్లు జెడ్పీటీసీ అనురాధ, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అనంత రెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావ్, ఎంపీటీసీలు కుమార్, సరిత తదితరులు పాల్గొన్నారు.